# సప్తతి మహోత్సవం

● మునిపల్లె రాజు
● చిత్రాలు: దీపక్

నిశ్శబ్దంలోనూ, మౌనంలోనూ ఒక మహత్తర శక్తి దాగి ఉంటుందని ఆయన సాహచర్యంలోనే నేను గ్రహించాను. మరి నాలుగేళ్ళ పైగా న్యాయవాద వృత్తిలో ఆయన జూనియర్‌గా ఎదిగినవాణ్ణి గదా. న్యాయస్థానంలో ఏ వివాదంలో తర్జనభర్జనలు జరుగుతున్నా, ఆయన అనర్గళ వాక్ప్రవాహానికి ఒకటి రెండు నిమిషాల మౌనం తప్పనిసరి. ఏదో యోగ సమాధిలోకి జారిపోయినట్లుగా ఆ నిశ్శబ్దం. ఆ తదుపరి వెలువడే మాటలు ఒక ప్రవక్త పవిత్ర ప్రవచనంలాగా, ఒక మహాకవి అంతర్జ్వలనం అక్షరరూపం దాల్చినట్లుగా గంభీర వాతావరణాన్ని కోర్టులో నెల కొల్పడం నా స్వీయానుభూతి పరంపర.

నా అభ్యర్థనను ఆయన ససేమిరా అంగీకరించలేదు. రెండు మన్వంతరాల కాలవ్యవధిలాంటి మౌనం తర్వాత ఆయనన్నారు: "అరవై ఏళ్ళు గానుగెద్దులాగా జీవించినందుకు ఒక షష్టిపూర్తి ఉత్సవం, పాతికేళ్ళు న్యాయవాదిగా నెట్టుకొచ్చినందుకు ఒక సిల్వర్‌జూబిలీ- వీటిలో నాకు నమ్మకం లేదు- సరికదా అదొక అల్పమైన అహంభావమని నా భావన. అవి మహామనీషులకు మాత్రమే తేజో దీపాలుగా మనవంటి సామాన్యులం వెలిగించవలసిన దివ్వెలు. కాలాయ తస్మై నమః అని ఒక ప్రార్థనాంతర్గత పాదం ఉన్నది. దాని అర్థం ఇది: 'దేనివల్లనైతే అన్ని శుష్క భోగాలూ స్మరణపథంలోంచి మాయమయ్యాయో ఆ కాలానికి నా నమస్కారం.' కృతజ్ఞతలు చెప్పుకోవలసింది కాలానికి. ఈ పండగల అల్ప ప్రజ్ఞకు కాదు."

మళ్ళీ నిశ్శబ్దం. నేనిక సెలవు తీసుకొందామని నమస్కారం చేసి లేస్తుండగా మౌనభంగం చేస్తూ ఆయన వారించారు. "కూర్చో మూర్తీ. ఇందాక మహామనీషులన్నానే వారిని గూర్చి నీకు వినాలని లేదా?"

"ఎందుకు లేదు సార్. మిమ్మల్ని విసిగించ గూడదని లేచాను."

"అయితే విను. నీకొక సప్తతి ఉత్సవం గురించిన ఉదంతం చెబుతాను."

గౌరీపతి గారి మాటలు గడచిపోయిన ఏ శతాబ్దపు చరిత్ర పుటల నుంచో సహజ గంభీరతతో వెలువడుతున్నట్లనిపించి వినమ్రంగా కూర్చున్నాను. యోగమాయ నుండి మేల్కొన్న నిశ్శబ్ద దేవత తన మంచు పెదవులను విప్పి పవిత్ర మంత్రోచ్చాటనను వినిపిస్తున్నప్పుడు, మానస సరోవరం నుండి కైలాస శిఖరం పైకి ఎగురుతున్న రాజహంస రెక్కల మార్మిక సంగీతం వినవస్తున్నప్పుడు అర్ధరాత్రి అయితేనేం, అపరాత్రి అయితేనేం? బయట చలిగాలి.

"ఫరవాలేదు. నీ సిగరెట్టు ముట్టించుకో."

"నేనా? మీ ముందా?"

"నా ముందే. మనం కలియుగంలో ఉన్నాం. కానీ, ఈ కథ ద్వాపర యుగంనాటిదిగా నీకు తోస్తుందేమో. అందుకని!"

* * *

"ముప్పై ఏళ్ళ తర్వాత మళ్ళీ మా ఊరు వెళ్ళాను. అప్పటికి నీవు ప్రయోజకుడివై మీ జిల్లాలో సొంత ప్రాక్టీసు ప్రారంభించావనుకొంటాను. ఎప్పటికప్పుడు ఏదో అవాంతరం ఎదురొచ్చి ఆగిపోయిన ప్రయాణం ఇది. 'ఏదో అవాంతరం' అని నెపం వెయ్యటం కూడా నిజానికి ఒక పలాయన మంత్రం. నగర జీవితపు సాలె గూడు చిక్కుల్లో ఇరుక్కొని మనం జీవిత గమనంలో ఏమి కోల్పోతున్నామో గ్రహించలేము గదా!

'చెన్నకేశవస్వామి దేవాలయం ధర్మకర్తృత్వం తప్పిస్తే (అది గూడా ఒక పరోక్ష కార్యమే!), నాకూ స్వగ్రామానికీ రుణం తీరి దాదాపు అర్ధ శతాబ్ది అవుతున్నది గదా, అక్కడి ఆ విశాల భవనం ఎవరికో ఒకరికి విక్రయించి పారేస్తే సరిపోతుంది గదా' అని మావాళ్ళు అంటుంటారు. దాని చుట్టూ ఉన్న అంటు మామిడి తోట మీద వచ్చే స్వల్పాదాయం నీ ఖర్చుల్లో ఏ మూలకు? (ఒకసారి నీవు కూడా ఈ ప్రశ్న వేశావని గుర్తు. నేనేం జవాబిచ్చానో స్మృతిలో లేదు.) జన్మభూమితో రుణం తీరిందనటం కృతఘ్నులకే చెల్లుతుంది. తప్పిపోయిన పశువులు గూడా తమ గాటను పసిగట్టి ఆ ఇంటికే వస్తాయి అని నేను సమాధానం చెబుతుంటాను. ఏమిటింత సెంటిమెంటల్‌గా ఆలోచిస్తున్నాడని అందరూ అనుకోవచ్చు.

ఒక్క బాల్యానందం, పితరుల సమాధులు, వాగులు, చెరువులు, గుళ్ళ గోపురాలు, ఆనాటి మిత్రబృందం- ఇవే కాదు, ఒక అలౌకికమైన, అభౌతికమైన చిదానందం ఒక రంగురంగుల కేతనంగా, ప్రాచీన సంగీత రాగంగా, జనని మృదుల హస్త స్పర్శగా, జీవన మూల్యాలనొత్తి పలికే ప్రాణశంఖంగా నాకు స్వప్న దర్శనమిస్తుంటుంది మా ఊరు. మా పెద్దల ఆధ్యాత్మిక, ఐహిక సంపదకు ప్రతీకగా మా స్వగృహం. ఏమో, నా సంతతిలో ఎవరికైనా ఈ దుష్ట అమానవీయ సంస్కృతి అభద్రత నుండి దూరం పోవాలనిపించినప్పుడు ఆ ఇల్లు ఆహ్వానించదా?

ఇంతకూ విచిత్రమేమిటంటే, ఆ ప్రయాణానికి నాందీ, ప్రేరణా, సంకల్పం ఒక కల. ఒక స్వప్న సంచలనం! మే నెలలో న్యాయస్థానాలకు వేసంగి సెలవులు గనక, సారస్వత సభలు ఏర్పాటు చేయాలని కొందరు సాహిత్యాభిలాషులు మా ఇంట్లో ఒక సన్నాహక కమిటీని సమావేశపరిచారు. ఆతిథ్యం మీది. కానీ, అది పుట్టక ముందే మరణించే అనేక ఆంధ్రోద్యమాల వంటి శిశువుగా మారింది. మైక్ దొరికితే చాలు పెద్ద ఉపన్యాసాలు, నీతులు, ఆశయాలు విసిరే ఆ మనుషుల్లో కుళ్ళు మొదటిసారిగా ప్రత్యక్షంగా చూశాను. మామూలు కుళ్ళు కాదు, కులం కుళ్ళు ప్రాంతీయాభిమానం కుళ్ళు, వర్గ, వర్ణ విభజనల కుళ్ళు, ఆత్మ విధ్వంసకుల విసుర్లు, పరస్పరారోపణలు, తిట్లు, తిమ్ముల మధ్య ఆ క్షణంలోనే ఆ కమిటీ రద్దయింది. ఈ గొడవతో ఆ రాత్రి నాకు నిద్ర పట్టలేదు.

తెల్లవారు జామున కల ఒక దీర్ఘ చిత్త విభ్రమంగా నన్ను వెంటాడింది. మా గ్రామ చెన్నకేశవస్వామి కోవెల ధ్వజస్తంభం కదిలి నన్ను వెతుకుతూ వస్తున్నదట. ఏమిటీ వైపరీత్యం? చెన్నకేశవుడికి ఎవరు తలపెట్టారు ఒక అమంగళాపచారం? స్థల పురాణాల్లో చాళుక్యుల పురా శాసనాల్లో, శతక గ్రంథకర్తల నిష్కామ భక్తి పదాల్లో వరప్రసాదుడుగా వినుతికెక్కిన స్వామి ఈ రాయబారం ఎందుకు పంపుతున్నాడు? ముస్లిం విధ్వంసకుల దండయాత్రల్లో రెండుసార్లు శిథిలమైనా మళ్ళీ ప్రాచీన వైభవంతో తలెత్తినవాడు గదా. క్షేత్రపాలకుడై ఆ తర్వాత వెలసిన ఉగ్రాంజనేయులు తన ధర్మాన్ని విస్మరించాడా? కమ్ముకొస్తున్న కాల మేఘాల లాంటి ఆందోళనలు, సంకీర్ణ, సంక్షుభిత అరణ్యమైన హృదయం- ఇది సాధారణ స్వప్నం కాదు.

నా ధర్మపత్ని అంటున్నది, "ఎందుకంత క్షోభపడ్తారు? ఒకసారి వెళ్ళొస్తే పోలా? పిల్లలు గూడా బియ్యపు చెట్లు చూడాలని ఉబలాటపడ్తున్నారు."

పిల్లలది కాన్వెంటు చదువుల సంస్కారం. వాళ్ళు మా ఊరు చూడలేదింతవరకూ. నా భార్య మా వివాహం తర్వాత గృహ ప్రవేశం నాడే చూసింది. చెన్నకేశవుడితో ఆమెకు పరిచయం లేదు.

రిపేరీలో ఉన్న కారు గ్యారేజి నుంచి తిరిగి వచ్చింది.

రాత్రికి పయనం. ఒంటరిగానే. ఆ మధ్యాహ్నం టపాలో రెండు జాబులు వచ్చాయి. నా దుస్స్వప్న సంకేతాలకు టిప్పణి లభించినట్లయింది.

* * *

మేమంతా అన్నగారు అని సంబోధించే మా దూరపు దాయాదులు సీతారాం గారి ఉత్తరం పరిధిలో చిన్నదే అయినా, అందులో ఈ లోకపు లౌకిక సంక్లిష్ట వ్యవహారాలన్నీ తేటతెల్లంగా ఉన్నాయి. మానవుడి ప్రమేయం లేకున్నా బాహ్యమైన బలవత్తర గతులు అతడి మీద ఎన్ని సమస్యలు మోపుతాయో న్యాయవాదిగా నేను గ్రహించని సంగతులెన్నో! ఆ జాబు కళ్ళు తెరిపించింది.

"తెలును గదా, మన ప్రపితామహులు ఆ శకంలో వందెకరాల మెట్ట భూమిని నిత్య కైంకర్యాల నిమిత్తం గుడి మాన్యంగా దానం చేశారని. ఆ శాసనం తూర్పు వైపు గోడలో ఇప్పటికీ ఉంది. పద్మాపురం ప్రాజెక్టు పుణ్యమా అని ఆ భూమి సస్యశ్యామలమైంది ఇటీవలనే. అర్చకస్వాములనుభవిస్తున్న పురాతన అగ్రహారంలో కొంతమేర భూములు అన్యాక్రాంతమైనా, వారి భుక్తికి లోటు లేదు. కొత్తగా ఆయకట్టు పరిధిలోకి వచ్చిన భూముల్ని చూడగానే సర్కారు వారి కన్ను కుట్టింది. ఈ ఆలయాన్ని దేవాలయ శాఖకు, జాయింటు వంశ పారంపర్య ధర్మకర్తలం మనం అధీనం చేయాలని నోటీసులు వచ్చాయి. నీకూ అంది ఉండాలి. గత వైభవాల్ని తలుచుకొని ప్రయోజనం లేదు. ధాత కరువు రోజుల్లో తమ ధాన్యాగారాల్ని తెరిచి పేదల్ని ఆదుకొన్న ఆ మహాత్ములు, దేవుడి తోటలో ఒక్క పుష్పాన్ని గూడా ముట్టుకోని మహితాత్ములు, ముస్లిం దండయాత్రీకులు, పిండారీలు దోచుకొన్న నగలను తిరిగి చేయించడమేనా- వసతులు కల్పించడానికి రాజగోపుర పునర్నిర్మాణం, ధ్వజస్తంభానికి ఇత్తడి తొడుగులు, ప్రహరీ గోడకు పటిష్ఠమైన మరమ్మతులు చేయించిన ఆ దానకర్తల మాట- ఈనాడు ఎవరు తలచుకొంటారు! వారికి కావలసింది దేవుని స్థిరచరాస్తులు.

శిష్టాచారులైన పాత తరం వృద్ధాచార్యులు మంచాన పడ్డారు. స్నేహపాపం చేత చెడిన వారి సుపుత్రుడు నా సంతకాన్ని కూడా ఫోర్జరీ చేస్తున్నట్లు



వినికిడి. దుష్ట రాజకీయాలు కమ్ముకొస్తున్న ఈ రోజుల్లో ప్రభుత్వ జోక్యం నబబేననిపిస్తున్నది. అయితే, ఒకే ఒక చింతన. మీ నాన్నా, నేనూ సేలం జైలులో నంకటి ముద్దల సీ క్లాసు ఖైదీలుగా ఉన్నప్పుడు మా హోదాకు తగినట్లు ఏ క్లాసు, బీ క్లాసు సౌకర్యాలు అడగలేదు. కానీ, దేవాదాయ స్పెషలాఫీసరు గారికి మీ 'కణ్వస భవనం' కావాలట. ఆలయ ప్రాంగణంలో విశాలమైన గదులు పనికిరావట. స్వామి బంగారు ఆభరణాల్లో ముఖ్యమైనవి, మన ప్రపితామహిద్వయం చేయించిన ఆనాటి బంగరు పంచామృతాల పాత్రలు, ఇంకేవేవో మీ మేడ భోషాణాల్లో భద్రంగా ఉన్నాయి. నిధిని రక్షిస్తున్న నాగు పాములాగా మీ కుటుంబ సేవాధర్మి- వెంకటస్వామి ఎంత ఒత్తిడి వచ్చినా వాటినెవరికీ చూపడు. ఇందుకోసం కాక

మా గ్రామ చెన్నకేశవ స్వామి కోవెల ధ్వజస్తంభం కదిలి నన్ను వెతుకుంటూ వస్తున్నదట. ఏమిటీ వైపరీత్యం? చెన్నకేశవునికి ఎవరు తల పెట్టారు ఈ అమంగళాపచారం?

పోయినా, దశాబ్దాలు దాటుతున్నా నీవిక్కడికి రాలేదు గదా. ఎదురు చూస్తాను."

రెండవ జాబు దేవాదాయ శాఖ వారి నోటీసులు. వెంటనే తంతివార్తలు పంపడమూ జరిగింది.

ఈ ప్రయాణం- ఇంకొక తరుణంలో, విభిన్న పరిస్థితుల్లో అయితే ఎంత ఆహ్లాద కరంగా ఉండేదో. దాదాపు నాలుగొందల మైళ్ళు. నా కారు వేగం ఒకటే నన్ను నడిపిస్తున్న శక్తి. నగర పొలిమేరలు దాటగానే ఒక శాంతిధామంలో అడుగులు వేస్తున్నట్లు అనుభూతి కలిగినా, ఈ నిశిరేయి పరుగులో గ్రామీణ శోభను దర్శించేదెక్కడ? అయినా, రైలు గేట్లు అధిగమించి కాలువల ఒడ్డునే సమాంతర రోడ్ల మీద పోతున్నప్పుడు, కృష్ణానది వారధిని చేరినప్పుడు వేదాల్లో నదీ సూక్తాలు; వచ్చని చెట్లను దాటు తున్నప్పుడు వేద ఋషులు వల్లించిన ఔషధీ వనస్పతుల శాంత సూక్తాలు ఏ లోయ నుండో పయనించి వస్తున్నట్లనిపించింది.

గ్రామ పొలిమేరల్లోకి ప్రవేశించేసరికి- అప్పటివరకూ శుభ శకునంగా తోడు నడిచిన వేగు చుక్క వెలవెలపోతూ కనిపించింది. అల్లంత దూరాన బ్రహ్మాండమైన కరకట్టల్తో సంజీవ రాయుడి తటాకం, మలుపు తిరగ్గానే ఏ పర్వదినాన్నో కదిలే చెన్నకేశవుడి రథపు చావడి. ప్రహరీ గోడల పైనుండి నిశ్చలంగా తలెత్తివున్న ధ్వజస్తంభం! ఈ ధ్వజమే గదా ప్రస్తుత పయనానికి మూలం. మలి మలుపులోనే మా 'కణ్వస భవనం'. కొత్తగా వెల్లవేయించినట్లుగానే ఉన్నది. అదొక దివ్యమంగళ దర్శనం.

నా తంతి సకాలంలోనే అందింది. గేటు ముందు చిన్న హారన్ కొట్టకుండానే వెంకటస్వామి హాజరు. వేణ్ణీళ్ళు తయారుగా ఉన్నాయ్. మేడమీదనే స్నానం చేశాను. కింద రెండు మూడు గదుల్లో ఎన్నేళ్ళ నుంచో నివసిస్తూన్న గ్రామ పాఠశాల ఉపాధ్యాయుడు సోమయాజుల్గారంపిన వేడివేడి కాఫీ. ఒళ్ళు తెలియక అట్లాగే నిద్రించాను. సాయం సంధ్యలో స్వామి దర్శనం అని భావించాను. సావకాశంగా సీతారాం అన్నయ్యతో మాట్లాడవచ్చుననుకొన్నాను.

నిద్రలేచి ముఖప్రక్షాళనంలో ఉండగా వెంకటస్వామి కబురు- పాతతరం గ్రామస్థులెవరో నన్ను చూసేందుకు వచ్చారట. మెట్లు దిగుతుండగా అవమానిత దుఃఖదేవతవలె, ఎక్కలేని ఆయాసంతో బృందావనాచార్యులు గారు. ఊర్ధ్వపుండ్రాలు, చేతిలో పులిహోర పాత్ర తప్పితే- చిక్కి శల్యమైన ఆకారం.

హేదివి పట్టుకొని నడిపించగా పైకి రాగలిగారు.

"బాబూ! వచ్చావా? త్రేతాయుగం గడిచింది, ద్వాపరం జారిపోయింది, కలి పాదాల భూమి ఇది. మీ మూడు తరాలవారు నాకు తెలుసు. జీవితం ధన్యమైంది. ఇక శ్రీ చెన్నకేశవులు ఏ క్షణాన పిలిస్తే తక్షణం ఆచార్య తిరువడికి ప్రయాణం కడతాను. కానీ, ఒక్క మనవి. నా ఏకైక పుత్రుడు పెడదారిన పడ్డాడు. కుతర్క పండితుడైనాడు. ఉత్సవమూర్తుల చౌర్యానికి గూడా తలపడిన పాపి. వాడిని క్షమించండి. అంతకన్నా ఎక్కువ కోరను."

సంధ్యాపూజలో మా గోత్రనామాలతో అష్టోత్తర శతనామావళి ముగించారు స్వయంగా. దీవించారు.

నేను స్వామికి పట్టువస్త్రాలు సమర్పించి ఊరు చూసేందుకు బయలుదేరుతుండగా, గోపురం కింద అప్రయత్నంగా నాలో నేను మాట్లాడుకొంటున్నాను: 'హే చెన్న కేశవా! నీ మీద నాకే అధికారం లేకుండా చేస్తున్నావా? కాల పుస్తకంలో ఐతిహాసిక వాణి మొదటి సంతకం చేసింది. ఇంక రెండో సంతకానికీ ఎక్కువ గడువు లేదు గదా! అవును, ఆఖరి పూజ గదా!'

ఊరు విస్తరించి సంకీర్ణమై, పట్నం సొగసులు దిద్దుకొంటున్నది. సీతారాంగారి ఇంటివైపు పురా అనుభవంతో మలుపు తిరిగాను. అక్కడా విశాల భవనం ఏదీ? నాకు స్మృతి ఉన్నంత వరకూ కలయజూశాను. ఒకనాటి ప్రాభవ అవశేషంగా అక్కడొక టెంటు సినిమా హాలు దర్శనమిచ్చింది. ఎవరో అంటున్నారు- 'ఆయనుండేది ఊరి బయట యానాది గూడెంలో కదా!' టెంటు హాలు ముందు డప్పుల మోతమధ్య పాత చిత్రాల్లోని డ్యూయెట్ పాటలు. నన్ను వెతుక్కుంటూ వచ్చిన వెంకటస్వామిని చూసి తప్పుకొన్న యువకుడు. "ఆచార్లుగారి కొడుకయ్యా!"

* * *

ఇల్లు చేరేసరికి మెట్ల మీదకే ఏదో సన్నని సువాసన వస్తోంది. లైటు ముందు నేను తెచ్చిన ఆంగ్ల నవలను తిరగేస్తూ సీతారాం అన్నయ్య. ఎదురుగా బల్లమీద చిన్న తాటాకుల బుట్టలో పాల సపోటాలు. విస్మృత కథకుడా! హిమాలయపు ఒంటరి లోయల్లో వెన్నెల పరుస్తున్న విషాద చంద్రుడిలాగా తోస్తున్నాడు. ఏ రహస్య నదీ తీరానో ఉదయ భాస్కరుడికి అర్ఘ్యమిచ్చి ఆదిత్య హృదయం పఠిస్తున్న యోగాభ్యాసపరుడిలా గోచరిస్తున్నాడు. టెంటు సినిమా హాలు చికాకు మాయమైపోయింది- ఆ దృశ్యం ముందు. పొందూరు ఖాదీ లాల్చీ, చలవ చేసిన ధోవతి, యౌవనమో, వృద్ధాప్యమో తెలియనీయని కాయపారు శరీరపు బంగారు ఛాయ, అయినా అలసట కమ్ముకొన్న కళ్ళు నాకాయన వృద్ధుడిగా తోచలేదు. సీతారాంగారు గొప్ప స్ఫురద్రూపి. ఏ స్త్రీ అయినా ఆకర్షణ తరంగాల ఊపుతో ఆయన యౌవన ప్రాయంలో మోహస్పందన జలపాతంలో తడిసిపోయి ఉండదా అనిపించింది.



లైటు ముందు నేను తెచ్చిన ఆంగ్ల నవలను తిరగేస్తూ సీతారాం అన్నయ్య. ఎదురుగా బల్లమీద చిన్న తాటాకుల బుట్టలో పాల సపోటాలు... కల్యాణి పంపింది.

పాదాభివందనం చేస్తుంటే వారించి, నా భుజాలనెత్తి కౌగలించుకుంటూ, "నీకు చాలా ఇష్టమని ఎప్పుడో అన్నమాటను గుర్తుపెట్టుకొని కల్యాణి పాలసపోటాలు పంపింది" అని కళ్ళతోనే నవ్వాడు.

"కల్యాణా?"

"యానాది సేవా సమితి కార్యదర్శి. నేనూ, చంద్రికా పెంచిన పాప."

చంద్రిక!

* * *

సీతారాంగారిది మా ఊరు కాదు. పెత్తల్లికి దత్తత వచ్చినవాడు. సంపన్న గృహస్థులు. నిజానికి మా ప్రాంతానికంతా పెద్ద మిరాశీదార్ల కుటుంబం. కవిపండిత సన్మానాలు, దసరా నవరాత్రి మహోత్సవాలను బ్రహ్మాండంగా నిర్వహించే సంస్కారులు. పెంపుడు తండ్రి శత గ్రంథకర్త, దేశభక్తుడు. రాయని భాస్కరుల దానధర్మాలతో స్వాతంత్ర్య ఉద్యమ కార్యకలాపాల్లో అప్పటికే చాలా ఆస్తి కర్పూరహారతి తర్వాత పెళ్ళైంది.

సీతారాంగారు కాలేజీ దశలోనే అతివాద రాజకీయాల్లో జోక్యం ఉన్నవాడు. ఎన్నో కథలు. వంగదేశంలో ఆనాటి విప్లవవాదుల 'అనుశీలన సమితి'ని ఆంధ్రదేశంలో పునరుద్ధరించాలని కంకణం కట్టుకొన్నట్లు చెప్పుకొనేవారు. ఒక ఏడాది పాటు అజ్ఞాతంగా బెంగాల్‌లో తిరిగి బాంబులు తయారు చేయడం నేర్చాడని గూడా వదంతి. వారం వారం పోలీసుల రాక, నిఘా. వాళ్ళ నాన్నగారికెందుకో అతణ్ణి బారిష్టర్ చేయాలని మక్కువ.

అయితే, సీతారాంగారు లండన్ వెళ్ళలేదు. అప్పటికి డీవెలరా నాయకత్వంలోని ఐర్లాండ్ రాజధాని డబ్లిన్‌కు పయనం. డీవెలరా బ్రిటిష్ శత్రువు గదా. కానీ, ఏ కారణం చేతనో ఒక సంవత్సరానికే డబ్లిన్ నుంచి తిరిగి వచ్చాడు. జనశ్రుతి వదంతుల్ని నమ్మితే, అక్కడొక ఐరిష్ యువతిని ప్రేమించాడనీ, సముద్రంలో ఈదుతూ ఆమె మరణించిందనీ, తాను భగ్నప్రేమికుడై తిరిగి వచ్చాడనీ- సత్యాసత్యాలెవరికీ తెలియవు. ఆ తర్వాత ఒకటి రెండేళ్ళు జాతీయ కళాశాలలో అధ్యాపక వృత్తి. ఇంతలో గాంధీజీ సత్యాగ్రహ సమరం. మా నాన్నగారితో సేలం జైలులో రమారమి మూడేళ్ళ కఠిన శిక్ష. కారాగారవాసం అతనిలో సంపూర్ణ పరివర్తన తెచ్చిందని నాన్నగారంటుండగా విన్నాను. ఎన్నో యోగాభ్యాసాలు, ఆసనాల నిబంధనలతో సన్నగా, రివటగా మిలమిలలాడే శరీరకాంతితో బయటకు రావడం ఒక అద్భుత చర్య. గీతా శ్లోకాలను అనర్గళంగా వల్లించేవాడు.

అప్పటికి పెంపుడు జననీజనకులిద్దరూ కాలధర్మం చెందడం, ఇంటి వ్యవహారాలు చక్కదిద్దుకొనే ప్రయత్నంలో కొన్నేళ్ళు. చక్కదిద్దుకొనేందుకు మిగిలింది దాదాపు శూన్యం. స్వార్థపరులైన కొందరు పెద్ద భూస్వాముల్తో కొన్ని చికాకులూ పడ్డాడు. మనశ్శాంతి కోసమే కాబోలు వినోబా భావే ఆశ్రమానికి హఠాత్తుగా తరలిపోయాడు. చంబల్ నదీలోయ ప్రాంతంలో వినోబాజీ బందిపోటు దొంగల్ని సంస్కరించే ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నాడని గూడా విన్నాను. కొన్ని సాహసకృత్యాలూ చేశాడని చెప్పుకొన్నారు. ముఖ్యంగా అందరూ చెప్పుకొన్నది- గ్వాలియర్ నగరానికి వంద మైళ్ళ దూరం అడవుల్లోకి బందిపోట్లు అపహరించుకుపోయిన పెళ్ళి బస్సును వెంటాడి, ఎవరికీ హాని జరగకుండా స్త్రీల ఆభరణాలతో సహా రక్షించాడని. కొందరు దొంగల్ని వినోబా ముందుకు తెచ్చి అస్త్ర సన్యాసం చేయించాడని. అమోఘమైన హిందీ వాక్చాతుర్యం కలవాడు. సంస్కృతం సరేసరి. ఏక సంథాగ్రాహి. బహుశా వినోబాజీ ప్రేరణతోనే కావచ్చు - తన స్వగ్రామ పరిసరాల్లో అశేషంగా ఉన్న- యానాదులనబడే ఆనాది ఆదివాసుల సేవకు అంకితమైనాడు అప్పటికాయనకు శేషభుక్తంగా ఉన్న ఆస్తి రెండెకరాల మాగాణి భూమి. దేవాలయ ధర్మకర్తృత్వం ఆయన మటుకు నామమాత్రమే. తన పెద్దల ధర్మాన్నే అనుసరించిన ఆదర్శమూర్తిగా నిలిచాడు.

సంఘ బహిష్కృతులు కాకపోయినా, జన తిరస్కృతులుగా, పరిచ్యుతులుగా బతుకు వెళ్ళదీసే యానాదులనందర్నీ సమీకరించాడు. చిల్లర మల్లర దొంగతనాలకు అలవడినవాళ్ళను గూడా సంస్కరించాడు. ఆత్మగౌరవం నేర్పాడు. గాంధీ వాదిగ గ్రామీణ పరిశ్రమల్లో, ముఖ్యంగా తేనెపట్టుల పెంచడం, బుట్టలు తట్టలు అల్లి అమ్మించడం కూరనారలు పండించడంలో వాళ్ళకు తర్ఫీదు ఇచ్చాడు. యానాది బాలబాలికల ఆశ్రమ పాఠశా

నెలకొల్పి కొత్త దీపాలు వెలిగించాడు.

అయినా, ఏదో అనంతృప్తితో, నిత్య శంకితుడుగా వేరేదో పరమ గమ్యాన్ని గవేషిస్తున్న నైష్ఠికుడిగా, సముద్ర దిశ కానక పరుగిడుతున్న నదీ ప్రవాహంలాగా తోచేవాడు. మరుటాయమానమైన ఒక చర్యగా, యానాదుల యక్షగాన భాగవత పునరుద్ధరణను చేపట్టాడు. గత స్మృతిగా ఉన్న ఉషాపరిణయ యక్షగాన నాటకాన్ని తర్ఫీదు చేయించాడు. యానాదుల్లో పరంపరగా వస్తున్న నలచరిత్ర నాటకం, ప్రభావతీ ప్రద్యుమ్నం తిరిగి జీవం పోసుకొన్నాయి. దసరా నవరాత్రుల్లో ప్రదర్శించడానికి ఎన్ని తిప్పలు పడ్డాడో. ఆ వివరాలన్నీ నాకంతగా తెలియవు. అప్పుడు ఓం ప్రథమంగా, ఒక అపురూప సౌందర్యవతి, ఒక యానాది యువతి బాణాసుర పుత్రి ఉషాకన్యగా మా గ్రామ యక్షగాన వేదిక మీద కనిపించింది. ఆమే చంద్రిక. శ్యామల వర్ణమైనా ద్రుపదరాజ తనయ అందం.

ప్రతి కదలికలో ఒక కులీన వంశపు సౌందర్యరాశిగా, ప్రతి పాటలో తన జీవితపు చిరమూర్త వేదనలకు గాత్ర రూపమిస్తున్న గాంధర్వ కన్యగా గోచరించేది. ఆ పాటల గమకాలు కొన్ని ఇప్పటికీ నాకు జ్ఞాపకమున్నాయి. గొప్ప అందానికి నల్లని చర్మం అడ్డురాదని చంద్రికను చూసింతర్వాత నేను గ్రహించాను. అప్పటికి నేను యువకుణ్ణి. ఊళ్ళో మదాంధులైన భూస్వామ్య పుత్రుల మాటలు కర్ణాకర్ణిగా వింటున్నాను. ఈ దుశ్శాసనుల పీడ నుండి చంద్రికను విరాయుధులు, అమాయకులైన యానాదులు రక్షించుకోగలరా అని ఎందుకను కొన్నానో. ఆర్నెల్ల తర్వాత లా కాలేజీ సెలవుల్లో ఇంటికి వచ్చినప్పుడు, ఒక ఘోర ఉదంతం విన్నాను. ఒక దుష్టుడు ఆమెను మానభంగం చేశాడనీ, మూడు రోజుల తర్వాత వాడి శవం సంజీవరాయుడి చెరువులో తేలిందనీ. ఆ రాత్రి మా ఇంటికి బంధువులెందరో వచ్చి ఉన్నారు- మా నాన్నగారి ప్రథమ సంవత్సరీకాలకు.

హడావిడిగా అర్ధరాత్రి సీతారాం వచ్చాడు. "ఇది నీ గదిలో భద్రంగా దాచు" అని ఒక చిన్న సంచీ ఇచ్చి పోయాడు అంత తొందరలోనే. హతుడి ఒంటి మీద గాయాలేమీ లేవుట. కానీ, శరీరం అంతర్భాగంలో విపరీత రక్తస్రావం కనపడ్డదట.

మా బంధువులందరూ నిర్గమించిన మరునాటి దివాన ఉబుసుపోక సీతారాంగారి సంచీ తెరిచాము. ఒక తెల్లటి గుడ్డలో కప్పి ఉన్న పిస్తోలొకటి కంటబడ్డది. "మేడ్ ఇన్ రిపబ్లిక్ ఆఫ్ ఎల్! అప్పటికే పోలీసులు రావడం, పోవడం జరిగింది. గ్రామంలో గుసగుసలేమీ వినబడలేదు. నేను తిరిగి కాలేజీకి బయలుదేరుతున్న రాత్రి సీతారాం ఆ సంచీని తీసుకువెళ్ళిపోయాడు. మరు సంవత్సరం వెంకటస్వామి పట్నం వచ్చి నప్పుడు ఒక సమాచారం చెప్పినప్పుడు- నేను ఆశ్చర్య పోలేదు. సీతారాంగారు చంద్రికను యానాదుల సంప్రదాయం ప్రకారం, ఒక మిట్ట మధ్యాహ్నం రోకలిని భూమిలో పాతి, దాని నీడ హరించిపోయినప్పుడు శుభముహూర్తంలో పెళ్ళాడారని. సినిమా రీళ్ళ త్వరిత చలనం లాగా ఈ దృశ్యాలూ, సంఘటనలూ నా మనో క్షేత్రంలో కదలాడినాయి- ఆయన చెబుతున్న మాటలు ఎక్కువ రిజిష్టర్ కాలేక పోతున్నాయి. ఇంతలో సోమయాజులుగారు భోజనం పైకే పంపారు. నేనూ, అన్నయ్యా భోంచేశాం. ఎల్లుండికి గాని దేవాదాయ శాఖాధికారులు ఇక్కడకు చేరరట- ఆచార్లుగారంపిన వార్త.

* * *

ఎల్లుట పది గంటలవుతూన్న ఉదయంలో డిప్టీ కమిషనరూ, బిళ్ళ బంట్రోతూ, ఒక చప్రాసీ, కాబోయే అసిస్టెంటు కమిషనరూ జీపులో దిగారు. డిప్టీ కమిషనర్‌గారి నోట్లో స్పెన్సర్ చుట్ట పొగ.

నేను దిగ్భ్రమ చెదాను. వీళ్ళా అధికారులు? ప్రభుత్వం? ఒక చరిత్రాత్మకమైన పురాతన దేవాలయాన్ని స్వాధీనం చేసుకోబోతున్నది- ఆ కళ్ళలో ఏ విషయ పరిజ్ఞానమూ గోచరించని వీళ్ళా వినమ్రత, చారిత్రక దృష్టి కనబడదే- ఆ ఎర్ర జీరల నేత్రాల్లో! వీళ్ళు దేవదూతలు కారు. కమీషన్లు గుణించుకొంటున్న అల్పులు. అసురులు.

కర్ణంగారు, ఇన్నేళ్ళుగా స్వామి కార్యాన్ని ఏ ప్రతిఫలమూ ఆశించకుండా భూ ఆదాయ వ్యయాల్ని చిట్టాలలో భద్రపరిచిన రంగయ్య గుప్తా, సీతారాంగారితో పైకి వచ్చారు. కర్ణంగారు అడంగులూ, సర్వే మ్యాపులు తీసి చూపి దేవుడి స్థిరాస్తి వివరాలన్నీ సమర్పించారు. రంగయ్య గుప్తా చిట్టాలన్నీ ముందు పడేశాడు.

అణా పైసల్తో కచ్చితంగా ఉన్న లెక్కల్ని చూసే ఓపిక వారికి లేదు.

"ఈ భవనం మాకేమిటి" అన్నారు నన్ను చూస్తూ కమిషనర్ గారూ, వారి అసిస్టెంటు.

"ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ భవనం మీకు దక్కదు. ఆశను పెంచుకోకండి. నేను లాయర్ని. మీ నోటీసులో అవకతవకలన్నీ నాకు అవగతం. ఆలయ ప్రాంగణం విశాలమైనది- మీకు కావలసినంత. మీ కార్యాలయాలు అక్కడ నిరభ్యంతరంగా కొనసాగుతాయి."

ఆయన గుడ్లు మిటకరించి చూసి, ఏమను కొన్నాడో యేమో, "మరొకసారి ఆలోచించండి. తొందర లేదు. ఈ భూముల్ని చూసుకొని మళ్ళా రేపు వస్తాం. చరాస్తులు, ఆభరణాలు, వస్తువాహనాల పట్టీ తయారుచేసి ఉంచండి. త్వరలో ముగిద్దాం" అంటూ లేచి నిలబడ్డారు.

సీతారాంగారేమీ మాట్లాడలేదు. వెంకటస్వామి అమర్చిన స్వల్ప ఆతిథ్యం స్వీకరించి, ఆ బృందం వెళ్ళిపోయింది. ఆ రాత్రి సోమయాజులుగారి సాయంతో ఆభరణాల పట్టీ తయారైనది. మా భోషాణంలో ఉన్న ఆ నగల్ని, హేమపాత్రల్ని నేనిదివరకంత పరిశీలనగా చూసి ఉండలేదు. హేమపాత్రల మీద మా మాతామహి ద్వయేరం పేర్లున్నాయి.

సీతారాంగారు గూడా ఆశ్చర్యంగా చూసి భక్తిభావంతో కళ్ళు మూసుకొన్నారు. కిరీటాలు, హస్తాభరణాలు, వెండి త్రిపుండ్రాలు, భుజ కీర్తులు, కర్ణాభరణాల జతలు, పంచామృత పాత్రలూ- అన్నీ లెక్కిస్తే రెండు వందల దాకా తేలాయి.

కింద దేవాలయం పనివాళ్ళు వేచి ఉన్నారు. చోపుదార్లు, పల్లకి వాహకులు, దివిటీల వాళ్ళు, దైనందిన నైవేద్య పరిచాలకుడు గోవర్ధనాచార్యులూ. వారందర్నీ పలకరించి ధైర్యం చెప్పి పైకి వచ్చేసరికి, ఆభరణాలను సర్దుతున్న వెంకటస్వామి, "ఒక బంగారు పాత్ర కనిపించలేదయ్యా నాలుగే ఉన్నాయి" అన్నాడు కంగారుగా. మళ్ళీ శోధించాం. కనిపించలేదు. చెన్నకేశవా ఏమిటీ భౌతిక ఆధ్యాత్మిక కల్లోలం తెచ్చిపెట్టావ్ ఈ దశలో.

ఆ రాత్రి నాకు భోజనం సహించ లేదు. ఎవరిదీ చౌర్యహస్తం? ఒకసారి సింహావలోకనం చేసుకొన్నాను. సోమయాజులుగారు ఒక్క వస్తువూ ముట్టలేదు.





దూరంగా టేబుల్ ముందు కూర్చొని మేము చెప్పిన్న పట్టీని రాసుకొంటూ పోయారు. వెంకటస్వామిని అనుమానించడం ఘోర పాపం. సోమ యాజులుగారు మా ముందే వెళ్ళిపోయారు. మిగిలింది నేనూ, సీతారాంగారూ. చివరకు నిర్గమించింది ఆయనే. చేతిలో సంచీ కూడా ఉంది. పరిపరివిధాల మనను పరుగులెత్తు తున్నది. ఈ ఆఖరి క్షణాల్లో తన దరిద్రావస్థలో ఈ పనికి పాల్పడ్డాడా? ఒక్క పాత్రతో ఆ దురవస్థ తీరుతుందా? ఏమో, పేదరికం ఎంత నికృష్టానికైనా పాల్పడుతుంది గదా. రేపు ఆచార్లుగారి సమక్షంలో ఏ సమాధానం చెప్పాలి? అనాలోచితులైన అధికార్ల దృష్టిలో ఎంత పల్చబడిపోతాం? మళ్ళీ అటువంటి పాత్రను చేయించడం నాకొక సమస్యగాదు. గతించిన మాతామహికి ఎంత అపచారం?

డిప్యూటీ కమిషనరూ. బిళ్ళ బంట్రోతూ. ఒక చప్రాసీ, దేవాదాయ అసిస్టెంట్ కమిషనరూ జీపులో దిగారు. డిప్యూటీ కమిషనర్‌గారి నోట్లో స్పెన్సర్ చుట్ట పొగ. నేను దిగ్భ్రమ చెందాను.

కలత నిద్రలో ఒక స్వప్న దృశ్యం. సీతారాం అన్నయ్య- గీతా రహస్యం ఒంటపట్టిన వ్యక్తి అనుకొంటున్న నాకు- బంగరు పాత్రను సంగ్రహించి సంచీలో వేసుకొంటున్నాడు రహస్యంగా. ఛీ... ఛీ... మానవత్వం మీద ఇన్ని నమ్మకాలు పెట్టుకొనడం నా బలహీనత. రేపు ముఖమెట్లా చూపగలడు? ఛీ! నేననుమానించిన హత్యకు అతనే బాధ్యుడు. ముమ్మాటికీ మనిషిని చంపగలిగిన వాడు చిన్న దొంగతనం చేయలేడా?

* * *

ఊహించినట్లే సీతారాంగారు మర్నాడు రాలేదు. దేవాదాయ శాఖవారూ రాలేదు. అశాంతితో, కుశంకలతో, అవమానభారంతో రోజంతా గడచింది. ఆచార్లుగారు ఫలహారాలు పంపారు. ముట్టలేక పోయాను. చీకటి పడుతుండగా ఒక యానాది యువకుడు సీతారాంగారి చీటీ తెచ్చి ఇచ్చాడు- "మా ఆశ్రమానికి రా. ఇవ్వాళ చంద్రిక నక్షత్రం ఉత్సవం."

ఛీ. ఏ ముఖం పెట్టుకొని? ఏమని మాట్లాడేందుకు? అయినా, అతనితో బయలుదేరాను. వెంకటస్వామికీ చెప్పలేదు.

యానాది సేవాశ్రమం గ్రామం వెలుపల మైలు లోపు దూరంలో ఏకాంతంగా ఉన్నది. ఆవరణలో కొబ్బరాకులు మీద సన్నని నక్షత్ర కాంతి కని పిస్తున్నది. దైన్య దేవత నిలయంలా ఆ పరిసరాలు. ఇంకేమీ కనబడలేదు. యానాది మనిషి కొబ్బ రాకుల తడికెను తొలగించి లోనికి పొమ్మన్నాడు. సన్నని దీపం వెలుగుకు కళ్ళు అలవడి పడుతున్నై. కానీ, ఏదో మాగిన పండ్ల ముక్క వాసన ముక్కు పుటాలను అదరగొడుతున్నది. నన్ను చూసి హరికేన్ లాంతర్ను ఇంకొంచెం ముందుకు జరిపారు. హఠాత్తుగా నా అడుగులు స్తంభించి పోయినై. అదొక భయానక దృశ్యం.

ఒక పాత మంచం మీద చంద్రిక. సింహం పోలికతో ఆమె ఒకనాటి చంద్రబింబం వంటి ముఖం. ముక్కును గూడా సగం తినేసిన ఘోరమైన కుష్ఠు వ్యాధి. గొంతు బొంగురుగా ఏదో పాడుతున్నది. పక్కనే స్టూలుబల్ల మీద కూర్చొని సీతారాం గారు ఆమెకు పాయసం తినిపిస్తున్నారు. ఆ పాత్ర కనపడకుండా పోయిన బంగారు పంచామృత పాత్ర. ఆమె నాకు ఓపికతో నమస్కారం చేయబోయింది. ఆ చేతులకు వేళ్ళులేవు. దుర్గంధం ఆగదు.

"రా, కూచో. ఇవాళ తన నక్షత్రం. దేవుని పాత్రలో ప్రసాదం తినాలని ఉందన్నది. గోల్డెన్ టార్చితో నా రోజుల్ని వెలిగించింది. జీవితం ధన్యమైందని కొద్ది క్షణాల క్రితం అన్నది" అంటున్నారు సీతారాం. నేనట్లాగే ఇంకో స్టూలు మీద కూలబడ్డాను.

కళంకభరితంగాని ఒక ప్రణయగాథ ముగింపు ఘట్టం. పైన ఏవో మృత్యు పక్షుల రెక్కల చప్పుడు వినిపించినట్లయింది. కనురెప్పల చప్పుడు గూడా వినవచ్చే నిశ్శబ్దం. తడికె మీద బల్లి, పురుగుల వేట మాని నిశ్చలంగా ఉంది. ఆవైపు మేజామీది అలారపు గడియారం ఆగిపోయి ఉంది.

ఆవరణలో చంద్రిక పెంచిన కుక్క శోక రాగాన్ని నిలిపివేసింది. కొబ్బరి చెట్ల ఆకులు కదులు తున్నట్లు లేవు.

కల్యాణి అగరుబత్తీల ధూపం వెలిగించింది. క్రమంగా దుర్వాసన మందగిస్తున్నది. తండ్రి చేతిలో పాత్రను కల్యాణి అందుకొంటున్నది. ఆయన ఒకనాటి చంద్రిక విశాల నేత్రాల మీద దుప్పటి కప్పాడు. చావుబతుకుల విభజనరేఖ నాకగుపించింది.

ఒక మనిషి మౌనమై, గీతాధ్యానమై, మహా యోగమై, మహిమాన్వితుడైన ఆ దివ్యక్షణాన సీతారాం గారికి ఈసారి మళ్ళీ పాదాభివందనం చేశాను.

మరునాడు కణ్వస భవన ప్రాంగణంలో చంద్రిక సమాధి అవుతుండగా, దేవాదాయ శాఖ వారు విచ్చే శారు. "ఈ భవనం, దీననుసరించుకొన్న భూములు, తోట యానాది సేవాసమితికి అంకితం చేసు న్నాను. వీళ్ళు ముగ్గురూ దాని ధర్మకర్తలు" అని వారితో చెప్పాను. ఐదవ పాత్రతో సహా అన్ని ఆభరణాలు వారికి ఆనాడే అప్పగించాను. ■